# గోదారమ్మ-11

గోదారమ్మ చిరునవ్వు నవ్వింది.

''నిజమే సీతా నువ్వన్నది, కాకపోతే ఒక విషయం చెప్పనా... నాకు సరిపడేంతగా, ఆసరాగా ఉండాలదనేది మినహాయించే, ఖర్చు చేస్తున్నాను! నిజానికి నా జీవితం ఇంకెంత... నాది వాలిపోయే పొద్దేకదా... ఎంత కావాలేం...! నీది మొదలవుతోన్న జీవితం.... పిల్లలూ, చదువులూ, ఖర్చులూ... చాలానే ఉంటాయి. అందుకే... మీకు పొదుపనేది అవసరం.

నేను అందరికీ సాయం చేసేస్తున్నాననీ, నాగురించి దాచుకోవటం లేదనీ ఇంతకు ముందూ ఒకసారి అన్నావు. నేను ఎవరైనా నిస్సహాయులకి మాత్రమే కొంచెం నిలదొక్కుకోగలగటానికి వీలైనంత ఆర్థిక సాయం చేస్తున్నాను. కష్టపడగలిగే సామర్థ్యం, వయసూ ఉన్నవాళ్ళు అర్థించినా, నేనేం సాయం చేయను. నా డబ్బుతో నిశ్చింతగా, రికామీగా ఉండాలనుకునే వాళ్ళను ప్రోత్సహించటం మన తప్పే కదా!... నిష్కర్షగా అటువంటివాళ్ళకు కాదని చెప్పగలను! అందులో నాకేం మొహమాటం లేదు.. డబ్బు ప్రాముఖ్యతను గుర్తించాల్సిందే. కానీ అదే ప్రముఖమైనదని మాత్రం అనుకోకూడదు. అవునా...? నా దగ్గిరున్న డబ్బుకి ఇపుడే గుర్తింపు, గౌరవం వచ్చిందని నాకనిపిస్తుంది. అదలా ఉండే కంటె... కొంచెంగానైనా కొందరికైనా ఉపయోగపడగలిగితే, సద్వినియోగపడినట్లేగా...!

అయితే నీతో నాకేర్పడిన అనుబంధం వేరు. నేను ఈ ఇంట్లో మనిషిలానే అనుకుని ఖర్చు పెడుతున్నాను. ఆర్థికంగా లోటు లేకపోయినా, నాకవసరం అయినపుడు ఆదుకోవటానికి నువ్వున్నావనే ధైర్యం ఏర్పడింది! చాలా భరోసాగా ఉంటున్నాను. అలా అక్కున చేర్చుకోగలిగే వాళ్ళని నలుగురిని సంపాదించుకున్నాననే అనుకుంటున్నాను! నిజమేగా సీతా...?'' అడిగిందావిడ.

ఆ మాటల్లోని ఆర్ద్రతకు సీత కదిలిపోయింది.

ఆవిడ చేతుల్ని ఆప్యాయంగా పట్టుకుంది.

''అమ్మా.... నేను మీకేం భరోసా ఇవ్వగలనమ్మా! మీరు ఈ ఊరుకు రావటం, నా ఇంట్లో ఉండిపోవటం... నాకు మాత్రమే కాదమ్మా... ఈ వూరంతటికీ కూడా ఉపకారమే!'' అంది సీత చెమర్చిన కళ్ళతో.

గోదారమ్మ చిన్నగా నిట్టూర్చింది.

‘‘మన ఇద్దరి మధ్యా బాగా అనుబంధమేర్పడిపోయింది. ఒక కుటుంబంలా మారిపోయాం! మీరిద్దరూ... మీకిద్దరు పిల్లలూ.... ఆపైన పెద్దదాన్నిగా నేనూ...! నాకీ వయసులో ఇంతకన్నా కావలసిందేం లేదు సీతా...!’’ అంది గోదారమ్మ సంతృప్తి నిండిన గొంతుతో.

ఆ తర్వాత...

కనకమ్మ ఓ గిన్నెతో వచ్చి విశ్రాంతిగా కూర్చున్న గోదారమ్మ ముందు పెట్టింది. అదేమిటన్నట్లుగా ఆవిడ చూసిన చూపుకు సమాధానంగా కనకమ్మ చెప్పింది. ‘‘మీ దయవల్ల మా అబ్బాయికి ఉద్యోగం వచ్చిందమ్మా. అందుకని ఈ రోజు పాయసం చేశాను. మీకూ కొంచెం రుచి చూపిద్దామని తీసుకువచ్చాను...’’

గోదారమ్మ నవ్వు మొహంతో ఆవిడవైపు చూస్తూ ‘‘చాలా మంచివార్త చెప్పావు కనకమ్మా ..సంతోషం. మీ అబ్బాయి కష్టపడి చదువుకున్నాడు. ఇపుడు ఉద్యోగం వచ్చింది. బావుంది. మధ్యలో నా దయ ఏముందమ్మా...!’’

ఆవిడ మాటలకు కనకమ్మ అభ్యంతరం చెబుతున్నట్లుగా తల అడ్డంగా వూపింది. ‘‘అలా అంటున్నారేమిటమ్మా... మీరు చెప్పటం వలనే కదూ... ఆ రామచంద్రవర్మ తన ఆఫీసులో ఖాళీ ఉందని మా వాడికి చెప్పి అప్లై చేయించటం, రికమెండ్ చేయటం జరిగిందీ...!’’

“మాటల మధ్యలో తన ఆఫీసులో ఖాళీ వుందని రామచంద్ర చెప్పగానే నీ మాటలు గుర్తువచ్చి, మీ అబ్బాయి సంగతి చెప్పానంతే. అంతే కదమ్మా నేను చేసింది. ఇందులో నా ప్రమేయం నామమాత్రమేగా!’’ అంది గోదారమ్మ.

‘‘అయితే మాత్రం... ఆ రోజు మీరు సాయం చేయనన్నారని నేను కొంచెం కోపంగా, విసురుగా వెళ్ళిపోయానా... అదేం మనసులో పెట్టుకోకుండా మీరు ఆ అబ్బాయితో, మావాడి గురించి మంచిగా చెప్పటం వలనే కదూ, వాడికి ఉద్యోగం వచ్చిందీ...!’’ అంది కనకమ్మ సంబరంగా.

‘‘అవును కనకమ్మా... నేనేదైనా కాస్త డబ్బుసాయం చేసివుంటే ఓ నాలుగైదు రోజులు కులాసాగా గడిచిపోయేదేమో... అంతేగా! ఇపుడు మీ అబ్బాయి చదువుకి ప్రతిఫలంగా ఉద్యోగం రావటం వలన... తన చదువుకి ఓ గుర్తింపు దక్కిందనే భావంతో పాటూ, కష్టపడి ఉద్యోగం చేసి సంపాదిస్తున్నాననే సంతృప్తి

కలుగుతాయి! ఏమైనా మన కష్టం మీద మనకు దక్కే ప్రతిఫలం ఇచ్చే ఆనందం ఇక దేని వలనా కలగదు. అవునా...?'' అంది గోదారమ్మ.

ఆ మాటలకు కనకమ్మా సంతోషంగా తలవూపింది.

స్కూలుకు వెళ్ళటానికి తయారవుతున్న సీతను పిలిచి... విషయం చెప్పి కనకమ్మ తెచ్చిన పాయసం గిన్నెను లోపల పెట్టమని చెప్పి... కనకమ్మతో "రేపు గిన్నెను మీ ఇంటికి పంపిస్తాలే కనకమ్మా...!" అంది.

ఆవిడ వెళ్ళిపోయింది.

సీతతో గోదారమ్మ మళ్ళీ చెప్పింది ''ఈ రోజు కనకమ్మ తెచ్చిన పాయసం తిందాం. రేపు మనం కొంచెం పులిహోర చేసుకుని కనకమ్మకూ ఖాళీ గిన్నె ఇవ్వకుండా పులిహోర వేసి ఇద్దాం. సరేనా...? మనకీ, వాళ్లకీ రెండు రోజులూ విందు భోజనాలవుతాయి!'' సీత కూడా అలాగే అన్నట్టు తలవూపి నవ్వుమొహంతో గిన్నెను పట్టుకుని లోపలకు వెళ్ళింది.

* * *

ఒక రోజు సీత, రామచంద్ర ఖాళీగా ఉన్నపుడు... గోదారమ్మ వాళ్ళతో ఒక మాట చెప్పింది.

''మీ ఇద్దరి సాయంతో 'రక్షణ' అనే సంస్థను మనం మన ఇంట్లోనే ప్రారంభించటం బావుంటుందా...? అని అడుగుదామనుకుంటున్నాను. పూర్ణ విషయంలో మనం చేసినట్లుగా, ఇంకెవరి పిల్లలకైనా అలాంటి విపత్తు కలిగితే, బయటకు చెప్పలేక బాధపడుతూ, ఏం చేయాలో తోచక సతమతమవుతూ వున్నవాళ్లకి అవసరమైన భరోసాను కలిగిస్తూ ఆర్థిక సాయంగానీ, మాటలతో ధైర్యం కలిగించటం గానీ చేయటం ఎలా ఉంటుందీ...?"

రామచంద్ర ఆవిడ మాటలకు ఆసక్తిగా చూశాడు. సీత మాత్రం ''మనం ఏం చేయగలమమ్మా...?'' అంటూ తన సందేహం బయటపెట్టింది.

''అంటే... వాళ్ళకవసరమైన న్యాయ సలహాలూ, వైద్య పరమైనవీ అందివ్వగలిగితే బావుంటుంది కదా? అందుకోసం రామచంద్రకి తెలిసిన లాయరు, డాక్టరూ ఉంటే... వాళ్ళని సంప్రదిద్దాం. మనం ఇలాంటి సాయం చేయగలుగుతామని తెలిస్తే... కొందరయినా ధైర్యం చేసి మన దగ్గరకు వస్తారని నా నమ్మకం. అందుకని మనం ఏ విధమైన కుటుంబపరమైన సలహాలూ, సాయం అవసరమనిపిస్తే రావచ్చని మన ఇంటిముందు

ఏర్పాటు చేసిన బోర్డుపై రాయిద్దాం. 'రక్షణ - అన్ని రకాల కుటుంబ సమస్యలకూ సలహాలూ, సాయం ఇవ్వబడును' అని. ఈ విధమైన ఆలోచన కలగటానికీ ఓ కారణం ఉంది. మీకు అదీ చెబుతాను...'' అనగానే రామచంద్రం, సీత ఏమిటన్నట్లు ఆసక్తిగా ఆవిడవైపు చూశారు.

ఆవిడ మొదలు పెట్టింది.

''ఆ మధ్య నేను గుడినుండి ఇంటికి వస్తున్నా నా... మన ఇంటికి రోజూ వచ్చి కాఫీ తాగే ఆనందరావు వాళ్ళ ఇంటిముందున్న అరుగుపై కూర్చుని కనిపించారు. నేను కాసేపు పలకరిద్దామని ఆగా. కానీ ఆయన నన్ను చూడనట్లుగా, పరధ్యానంగా కనుపించేసరికి నాకు ఆశ్చర్యం కలిగింది.

నేను దగ్గరకు వెళ్ళి అరుగుమీదే ఆయన పక్కన కూర్చున్నా గమనించలేదు. ''ఏమిటండీ అంత పరాకుగా ఉన్నారూ...?'' అనడిగితే, అపుడు ఉలిక్కిపడి నన్ను చూసి 'అమ్మా... మీరు వచ్చారా... నేనేదో ఆలోచనలో ఉండి గమనించలేదు' అన్నాడాయన సంజాయిషీగా.

'పరాకుగా ఉన్నారని తెలుస్తూనే ఉంది. మీ మొహంలో ఏదో దిగులు కూడా ఉంది. అదేమిటో తెలుసుకోవచ్చా?' అనడిగితే ఆయన నవ్వే ప్రయత్నం చేస్తూ 'అదేం లేదండీ' అని దాటవేయబోయారు కానీ నాకా మాటలు నిజమనిపించక మళ్ళీ మళ్ళీ అడిగేసరికి అపుడాయన ఉగ్గబెట్టుకున్న బాధనంతా వెళ్ళగ్రక్కారు. కళ్ళవెంట నీళ్ళు ధారకట్టాయి.

ఆయన చెప్పిన విషయం విన్నాక నాకు కలిగిన విభ్రాంతి అంతా ఇంతా కాదు!

ఒక క్షణం మాటలు ఆపి గోదారమ్మ నిశ్శబ్దంగా తలవంచుకునే సరికి వాళ్ళిద్దరూ "ఏం చెప్పారమ్మా ఆయన...?'' అని ఆత్రుత చూపించారు.

గోదారమ్మ నిట్టూర్చింది.

''చాలా పెద్ద కష్టమే. రామచంద్ర దగ్గరకు వచ్చి చదువుగురించి సలహాలని తీసుకుంటున్న పూర్ణ విషయంలో జరిగినట్లే... ఆనందరావు మనవరాలికీ జరిగిందట...! కాకపోతే తేడా ఉందనుకోండి. ఆ అమ్మాయి తనతో పాటూ చదువుకుంటూన్న అబ్బాయితో... ప్రేమ కలాపం సాగించి మోసపోయిందన్నమాట! అతను వాళ్ళిద్దరి ఫోటోలవీ బయటపెడతానంటూ తనమాట వినాల్సిందేనని బెదిరిస్తూన్నాడంట! ఆ అమ్మాయి ఆ విషయం ఎవరితోనూ చెప్పుకోలేక, చివరకు వాళ్ళమ్మతో చెప్పిందట.

ఇంట్లో ఈ  విషయంగా రగడ జరుగుతోందని, ఏం చేయాలో తోచక సతమత మవుతున్నామని ఆయన గద్గద కంఠంతో చెబుతోంటే నేను విస్తుపోతూ విన్నాను. ఈ వూళ్ళోనే ఇలా జరగటం నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది. భయపడకుండా పోలీసులకు చెప్పాల్సిందేనని నేను ధైర్యం చెప్పాను. భయపడేవాళ్ళను ఇంకా ఇంకా అలా బెదిరిస్తూనే ఉంటారనీ, ధైర్యంగా ఎదురుతిరిగి పోలీసులకి చెబితే... వాడూ దారిలోకి వస్తాడనిపించింది. అదే చెప్పాను. ఇద్దరి తప్పూ ఉంది. కానీ.... చూడండి... అమ్మాయికి మాత్రమే శిక్ష! పరువుపోతుందనే భయంతో వాళ్ళు ఎవరికీ చెప్పుకోలేరని వాడి ధైర్యం! అందుకే అలా తెగించి డబ్బుకోసమో, మరి ఇంకోదానికోసమో బెదిరించే సాహసం చేస్తున్నాడు! అలాంటి వాళ్ళ ఆటలు సాగవని తెలియజేయటం కోసమైనా... ధైర్యంగా పెద్దల అండతో ముందుకు వచ్చి పోలీసు రిపోర్టు ఇవ్వాలి! అపుడే అందరికీ భయం కలిగి ఆడపిల్లల విషయంలో జాగ్రత్తగా ఉంటారు!''

ఆవిడ అలా చెబుతోంటే... సీత మధ్యలో కల్పించుకుంది. ''అవునమ్మా... నేనూ గమనించాను... ఎపుడూ హుషారుగా ఉండే ఆయన ఎందుకలా దిగులుగా ఉన్నారని అనిపించింది కానీ ఎవరికైనా అపుడపుడూ ఇంట్లో ఏవో సమస్యలు వస్తూంటాయి కదా అనుకున్నానే గానీ ఇలాంటి విపత్తు వచ్చిపడిందని అనుకోలేకపోయాను...!''

రామచంద్ర కూడా గోదారమ్మతో ఆవేశంగా అన్నాడు ''అవునమ్మా... మీ ఆలోచనబావుంది. ముందు మనం ఆనందరావుగారితో మాట్లాడి అందరం కలిసి పోలీసు రిపోర్టు ఇద్దామని, అందులో పరువుపోయేదేం లేదని ధైర్యం చెబుదాం...!''

గోదారమ్మ నిజమన్నట్లుగా తలవూపింది. ''పెద్దవాళ్ళు పిల్లలకు అండగా నిలబడి ధైర్యం చెప్పాల్సిందే! ప్రేమ పేరుతో మోసపోవటం కొందరు అమాయకుల విషయంలో జరుగుతూనే ఉంటుంది. మందలించటం సరే. కానీ వాళ్లలో మార్పు వచ్చేలా ధైర్యాన్ని ఇవ్వటం కూడా ముఖ్యమే! మన ఇంట్లో దొంగలు పడి దోచుకుపోతే, ధైర్యంగా పోలీసులకు చెబుతాం కదా... ఇలాంటి విషయాల్లోనూ అదే జరగాలి! దొంగలు కన్ను పడకుండా మనం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో, పిల్లలకీ కొన్ని విషయాల్లో అలాంటి జాగ్రత్తలు అవసరమని మనం తెలియజెప్పాలి! కేవలం ఆడపిల్లల విషయంలోనే కాదు, మగపిల్లలకీ చెప్పగలగాలి! అలాంటపుడు ఇలాంటి విపరీతాలు జరిగే అవకాశాలు ఉండవు.''

రామచంద్ర, సీతా కూడా ఆవిడ మాటల్ని అంగీకరిస్తున్నట్లు తలలూపారు. ఇద్దరూ కూడా తమకు తెలిసిన లాయర్లు, పోలీసులు, డాక్టర్లు వారి గురించి ఆలోచనలు మొదలు పెట్టారు. అవసరమైనపుడు వారి

సలహాలూ తీసుకోవటానికి వీలుగా ముందుగా వారితో సంప్రదింపులు జరపటం బావుంటుందనే ఆలోచన వచ్చింది.

గోదారమ్మ కూడా పద్మావతమ్మ ఇంటికి వెళ్ళి ఈ విషయం చెప్పింది. ఇలాంటి ఆలోచన రావటంతో, ముందుగా పద్మావతిని సంప్రదిస్తున్నానని చెప్పగానే, పద్మావతి వదనం సంతోషంతో వికసించింది. తన వల్ల వీలయ్యే ఏ పని అయినా చేస్తానని చెప్పింది. వాళ్ళాయన సహకారమూ ఉంటుందని హామీ ఇచ్చింది.

ఇలాంటి పని ఏది తలపెట్టినా, ఊరందరి సహాయ సహకారాలు అవసరమని గోదావరమ్మ గ్రహించింది కనుకనే ఆ ఆలోచన అమలులో పెట్టి పద్మావతితో చెప్పటంతో పాటూ మరికొందరికీ తెలియజేయాలని అనుకుంది.

సీతా వాళ్ళింటిముందు 'రక్షణ' అనే బోర్డును ఏర్పాటు చేశారు. అనుకున్నట్లే క్రింద 'అన్నిరకాల కుటుంబ సమస్యలకూ పరిష్కారం చూపించబడును' అనీ రాసారు. 'మీ సమస్యలు రహస్యముగా ఉంచబడును' అనే మాటా చేర్చారు. అపుడు లైంగిక వేధింపులకు గురైనవాళ్ళుకూడా ధైర్యంగా వస్తారని భావించటం జరిగింది.

అలాగే... ఏర్పాటు చేసిన మర్నాడే ఆనందరావు కొడుకూ, తన కూతురును తీసుకుని వచ్చాడు. రామచంద్ర తనకు తెలిసిన ఓ లాయరునూ, ఒక డాక్టరునూ కలిసి వాళ్ళ సహాయం కోరాడు. అవసరాన్ని బట్టి రోజులో కొంత సమయం కేటాయిస్తామని మాటా ఇచ్చారు. కేసులను బట్టి వాళ్ళకూ ఫీజునూ చెల్లిద్దామని గోదారమ్మ చెప్పింది. వాళ్ళు కూడా సేవాదృక్పథంతో ఏర్పాటు చేయబడినవి కాబట్టి ఫీజు చాలా తక్కువగా తీసుకుంటామని హామీ ఇవ్వటం జరిగింది.

అలా ఆ వూరంతటికీ అటువంటి ఉపకారం జరిగింది.

పోలీసులకి ఆనందరావు మనవరాలిని వేధిస్తున్న అబ్బాయిపై కేసు పెట్టడంతో, అతను కాళ్ళ బేరానికి వచ్చాడు. అలా సమస్య తీరటంతో వాళ్ళింట్లోవాళ్ళూ తేలిగ్గా పిరి పీల్చుకున్నారు. ఇక అలాంటి గొడవల జోలికి పోకుండా బుద్ధిగా చదువుకుంటానని ఆ అమ్మాయి చెప్పటంతో అందరికీ హాయిగా అనిపించింది.

సీత గోదారమ్మను అభినందిస్తూ ''అమ్మా... ఇలాంటి పని చేయాలని మీకనిపించటం చాలా ఆశ్చర్యంగా ఉంది! మీరీ ఊరుకు రావటం వాళ్ళ అదృష్టమని వూరివాళ్ళంతా అనుకుంటున్నారమ్మా....!'' అంది.

ఆ మాటలకు ఆవిడ చిరునవ్వు నవ్వింది.

''సీతా... నీకో మాట... నిజం... చెప్పనా...?'' అందావిడ.

''చెప్పండమ్మా....!'' అంటూ సీత ఆవిడవైపు విచిత్రంగా చూసింది.

''సీతా... నేనీ వూళ్ళో ఉండటానికి ఒక కారణం గోదావరైతే, మరొక కారణం నువ్వే. అది నిజం. నేను కొన్నాళ్ళుండి చూసి నాకు నచ్చకపోతే వేరేచోటకి మారిపోదామని అనుకున్నా. కానీ నీతో ఏర్పడిన అనుబంధం వలన...ఈ ఇంట్లో చేరిన కాసేపటికే ఇదే నా నివాసం అని నిశ్చయించుకున్నాను.

నేను నలుగురితో కలిసి మెలిసి ఉండాలనే ఇక్కడికి వచ్చాను. నిన్ను గురించి... ఇక్కడ కూర్చుని కాఫీ తాగేవాళ్ళ మాటలను విన్నపుడు ఆశ్చర్యం కలిగింది. తర్వాత నీ నైజం గమనించాక వాళ్ళ మాటల్లో అసత్యం ఏమీ లేదని గ్రహించాను. నువ్వు ఉద్యోగం చేస్తూనే, నీ ఖాళీ సమయాల్లో అందరికీ అండగా ఉండగలుగుతున్నావు, నాకు రోజంతా ఖాళీయేగదా... ఏదో కాసేపు ఇంటిపనుల్లో నీకు కొంచెంగా సాయపడగలుగుతున్నానంతే కదా! నిన్ను ప్రేరణగా భావించే నేను ఊళ్ళో వాళ్ళ సమస్యల్ని తెలుసుకుంటూ నేను చేయగలిగినది చేస్తున్నా!'

సీత ''భలే వారమ్మా....!'' అంటూ పెద్దగా నవ్వింది.

''... మీ గురించి గొప్పగా నేను చెబుతూంటే... మీరేమో నన్ను స్ఫూర్తిగా తీసుకున్నానంటూ చెప్పి, ఘనతను నాకే చెందుతుందంటూ చెప్పటం చాలా ఆశ్చర్యంగా ఉంది!''

గోదారమ్మ నిట్టూరుస్తూ అంది ''అవున్లే సీతా... మనిద్దరి గొప్పా లేదు... ఒక వూరివాళ్ళంతా తాము ఒకే కుటుంబమని అనుకుంటూ, తమ సమస్యల్ని తామే పరిష్కరించుకుంటూ సహాయ సహకారాల్ని ఇచ్చి పుచ్చుకోవటం చాలా బావుంటుంది కదూ...? ఇలాగే జరగాలని కోరుకుందాం...!''

"అది నిజమమ్మా...!" అంది సీత.

* * *